క్లుప్తంగా

రక్తదానం.. మరొకరికి ప్రాణదానం



ఊట్కూరు: రక్తదానంతో మరొకరి ప్రాణాలను కాపాడవచ్చని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పగుడాకుల శ్రీనివాస్ అన్నారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్ జన్మదినం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 30మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దొబ్బలి హనుమంతు, నారాయణ, మండల అధ్యక్షుడు సైబన్న, నవీన్‌గౌడ్, అశోక్, గోవర్ధన్, రాజు, సందీప్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పురాతన కట్టడాలను కాపాడాలి



మాగనూర్: మండలంలోని మందిపల్లిలో పురాతన కట్టడాలను కాపాడాలని గ్రామస్తులు కోరారు. వందల ఏళ్ల నాటి బురుజు శిథిలావస్థకు చేరి కనుమరుగవుతుందని తెలిపారు. చరిత్రాత్మక కట్టడాలను కాపాడి, వాటి ప్రాముఖ్యతను రాబోవు తరాలకు తెలియపర్చాలని అవసరం ఉందని పేర్కొంటున్నారు. ప్రపంచ ప్రఖ్యాతి కలిగిన కోహినూర్ వజ్రం కొల్పూర్ ప్రాంతంలో లభించిందని తెలుస్తుందని, అలాంటి చరిత్ర కలిగిన ప్రాంతాల్లో పురాతన కట్టడాలను రక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గ్రామంలో బురుజు పునర్నిర్మించాలని కోరుతున్నారు.

ఆర్డీఓను కలిసిన గిరిజన ఉద్యోగులు



నారాయణపేట రూరల్: గిరిజన ఉద్యోగ సమైక్య సంఘం నాయకులు సోమవారం ఆర్డీఓను కలిశారు. ఈ సందర్భంగా సంఘం నూతన కమిటీ సభ్యులను పరిచయం చేశారు. సంఘం అభివృద్ధికి సహకరించాలని ఆర్డీఓను కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వాల్యానాయక్, కార్యదర్శి గోపాల్‌నాయక్, తిరుపతి, రాజు, వెంకటమ్మ, బహదూర్, శంకర్, అంభ్యానాయక్, రవీందర్, కిష్యానాయక్, తార్యానాయక్, మురహరి, శంకర్, జయప్రకాష్‌నాయక్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం లోపించొద్దు



మక్తల్: గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలని ఎంపీడీఓ సద్గుణ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండంలోని లింగంపల్లిలో సోమవారం డ్రెయినేజీలు, పంచాయతీ భవన నిర్మాణ పనులతో పాటు నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని తెలిపారు. నర్సరీలో క్రమం తప్పకుండా మొక్కలకు నీరందించి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుజాత, ఎంపీఓ రషీద్, పంచాయతీ కార్యదర్శి రవి పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు తరలించాలని నిరసన

అమరచింత: పట్టణంలోని 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న డంపింగ్ యార్డును వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ ట్రాన్స్‌కో కార్మికులు సోమవారం మరికల్–ఆత్మకూర్ ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని చెత్తను తీసుకొచ్చి డంపింగ్ యార్డులో వేయడం, చికెన్, మాంసానికి సంబంధించిన వ్యర్థ పదార్థాలను అక్కడే పారవేస్తుండడంతో దుర్వాసన వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డులోని చెత్తను తగలపెట్టడంతో పొగతో సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహించలేక పోతున్నామని వాపోయారు. పక్కనే చేనేత వస్త్రాలను తయారు చేస్తున్న కార్మికులు సైతం దుర్వాసనతో కూడిన పొగను తట్టుకోలేక రోగాల బారిన పడుతున్నారన్నారు. డంపింగ్ యార్డును వెంటనే తరలించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా అక్కడికి చేరుకుని వారం రోజుల్లో డంపింగ్ యార్డును వేరే ప్రాంతానికి తరలిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.






నారాయణపేట చౌడేశ్వరీదేవి ఆలయంలో.., కోటకొండ కన్యకాపరమేశ్వరి ఆలయంలో.., సింగారం భవానీమాత ఆలయంలో...,అంబాభవాని ఆలయంలో..

గాయత్రీమాత.. నమోస్తుతే

- వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు
- అమ్మవారికి విశేష పూజలు



మరికల్‌లో..



మద్దూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు

నారాయణపేట రూరల్ : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని శక్తిపీఠంతో పాటు మహంకాళి, చౌడేశ్వరి, అంభా భవాని, నగరేశ్వరాలయం తదితర ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అష్టోత్తర శతనామావళి, శ్రీచక్ర కుంకుమార్చన నిర్వహించారు. అదేవిధంగా పట్టణంలో కొలువుదీరిన దుర్గామాత విశేష పూజలు అందుకున్నారు. మండలంలోని లోకాయపల్లి లక్ష్మమ్మ ఆలయం, సింగారం గిరిపీఠంపై వెలిసిన భవానిమాత, కోటకొండ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు.

ఊట్కూరు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారు గాయత్రీమాత అలంకరణలో విశేష పూజలు అందుకున్నారు. మండల కేంద్రంలోని భవాని మందిర్‌లో అమ్మవారిని గాయత్రిదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో చౌదరి అశోక్, చంద్రప్రకాష్, సుధాకర్‌రావు, చందూలాల్, వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మరికల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



ఊట్కూరులోని భవాని మందిర్‌లో..

మద్దూరు: మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాతను గ్రాయత్రీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు సామూహికంగా కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో పూజారి మధుసూదనాచారి, జగన్నాథం, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ధన్వాడ: మండలంలోని ఆయా గ్రామాల్లో కొలువుదీరిన దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలో వీరభద్రేశ్వరస్వామి, అంబా భవాని ఆలయాలతోపాటు రజక సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి పూజలు చేశారు. మారుతీనగర్ కాలనీలో కొలువుదీరిన అమ్మవారు మంగళగౌరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

మక్తల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో వాసవీమాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పండ్లు, బెల్లం, నాణాలతో తులాభారం నిర్వహించారు. మహిళలు సామూహికంగా కుంకుమార్చన నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉమామహేశ్వర ఆలయంలో నల్లజానమ్మ, వాసవీమాతకు ప్రత్యేక పూజలు చేశారు. మాద్వార్ బ్రహ్మంగారి ఆలయంలో కొలువుదీరిన దుర్గామాత విశేష పూజలు అందుకున్నారు.



ధన్వాడ అంబాభవాని ఆలయంలో..



మక్తల్ వాసవీమాత ఆలయంలో..



మక్తల్‌లో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల అభ్యున్నతి



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోస్గి: కాంగ్రెస్ పార్టీతోనే అన్నివర్గాల అభ్యున్నతి సాధ్యమవుతుందని ఆ పార్టీ నాయకులు అన్నారు. పట్టణంతో పాటు పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ మేనిఫెస్టోలో అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు తెలిపారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు వార్ల విజయ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, కౌన్సిలర్ చంద్రకళ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మలుపులు



మాగనూర్: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులపై ఉన్న మలుపులు ప్రమాదకరంగా మారాయి. రోడ్లకు ఇరువైపులా ముళ్లపొదలు ఏపుగా పెరగడంతో వాహనదారులు మలుపులను గుర్తించక ప్రమాదాలకు గురవుతున్నారు. గ్రామీణ రోడ్ల అభివృద్ధి కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు కేటాయిస్తున్నా.. ప్రమాదకర మలుపులను మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని అడవి సత్యారం, కొల్పూర్ గ్రామాల మధ్య ఉన్న మూలమలుపు ప్రమాదకరంగా మారినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూలమలుపు వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాపోతున్నారు. మలుపుల వద్ద సూచిక బోర్డుల ఏర్పాటుపై సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు రోడ్లకు ఇరువైపులా ముళ్ల పొదలను తొలగించాలని కోరుతున్నారు.

బతుకమ్మ.. బతుకమ్మ.. ఉయ్యాలో



నారాయణపేట హంసవాహిని స్కూల్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

నారాయణపేట రూరల్: పట్టణంలో సోమవారం బతుకమ్మ సంబరాలను కనుల పండువగా నిర్వహించారు. గాంధీనగర్, శాతవాహనకాలనీ, పర్మారెడ్డికాలనీ, సత్యసాయికాలనీ, సాయివిజయకాలనీ, తేజాఫ్రెండ్స్, బాపునగర్, టీచర్స్‌కాలనీ, అశోక్‌నగర్, దూల్‌పేట తదితర ప్రాంతాల్లో మహిళలు, బాలికలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కోలాటాలు, దాండియా ఆడారు. అనంతరం పట్టణ శివారులోని చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. అదే విధంగా హంసవాహిని ఉన్నత పాఠశాల విద్యార్థినులు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ వస్త్రధారణతో బతుకమ్మలను తీసుకొచ్చి ఆడి పాడారు. అనంతరం కొండారెడ్డిపల్లి చెరువులో నిమజ్జనం చేశారు.



శాతవాహన కాలనీలో..

ఇథనాల్ కంపెనీతో ప్రజలకు ముప్పు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మరికల్: మండలంలోని చిత్తనూర్ ఇథనాల్ కంపెనీతో దాదాపు 50 గ్రామాల ప్రజలకు ముప్పు పొంచి ఉందని, కంపెనీని మూసివేయాలని ఎక్లాస్‌పూర్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ సునీతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాభిప్రాయం తెలుసుకోకుండా చిత్తనూర్‌లో ఇథనాల్ కంపెనీ ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కంపెనీపై చర్యలు చేపట్టకపోతే నిరవధిక ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మమ్మ, నాయకులు చింతలయ్య, రాములు, వెంకటయ్య, రఘు, మొగులప్ప, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి

ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఊట్కూరు: ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపునకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని సమస్తాపురంలో సోమవారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ బీఫాం అందుకున్న ఎమ్మెల్యేను పార్టీ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలకు సూచించారు. తనపై నమ్మకంతో పార్టీ బీఫాం ఇచ్చిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు సమస్తాపురం శివారులోని శంకర్ లింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.జెడ్పీటీసీ అశోక్‌కుమార్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, అరవింద్‌కుమార్, సుధాకర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, ఎల్లాగౌడ్ పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

బీఆర్ఎస్‌లో చేరిక

మాగనూర్: మండలంలోని అడవి సత్యారం గ్రామానికి చెందిన 30మంది బీజేపీ నాయకులు మక్తల్‌లో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సకాలంలో సరుకులు అందించాలి



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న రేషన్ డీలర్లు

నర్వ: మండలంలోని రేషన్ లబ్ధిదారులకు సకాలంలో సరుకులు అందించాలని తహసీల్దార్ మల్లారెడ్డి రేషన్ డీలర్లకు సూచించారు. ఇటీవల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన మల్లారెడ్డిని సోమవారం రేషన్ డీలర్ల అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా రేషన్ దుకాణాల పనితీరు, ఇబ్బందులను తహసీల్దార్ తెలుసుకున్నారు. రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ మండల అధ్యక్షుడు బాల్‌రాజ్, జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకటయ్య, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, అంపయ్య, బాలకిష్టన్న, కురుమూర్తి, రాములు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదరిస్తే మరింత సేవ చేస్తా

ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

దామరగిద్ద: మరోసారి ఎమ్మెల్యేగా అవకాశమిస్తే ప్రజలకు మరింత సేవ చేస్తానని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని క్యాతన్‌పల్లి వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎన్నికల ప్రచార శంఖారావాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలను ద్దేశించి ఆయన మాట్లాడుతూ మచ్చలేని రాజకీయ జీవితంతో పదేళ్ల ఎంతో అభివృద్ధి సాధించుకున్నామన్నారు. మరోసారి అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధి సాధించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. బీఆర్ఎస్ ప్రకటించిన ఎన్నికల మెనిఫెస్టోను ప్రజలకు తెలియజేయాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం బైక్ ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆశన్న, ఎంపీపీ నర్సప్ప, జెడ్పీటీసీ లావణ్య, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు భీమయ్యగౌడ్, వైస్‌ఎంపీపీ దామోదర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు ఈదప్ప, వెంకట్‌రెడ్డి, బసంత్‌రెడ్డి, బస్వంత్‌రాజ్, శరణప్ప, తిప్పణ్ణ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల బైక్ ర్యాలీ



ధన్వాడ: మండలంలోని బీఆర్ఎస్ నాయకులు సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆయా గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు బైక్‌లపై ర్యాలీగా మండల కేంద్రానికి చేరుకున్నారు. అనంతరం జిల్లా కేంద్రానికి ర్యాలీగా బయల్దేరారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, సునీల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో అగ్నిప్రమాదం



ధన్వాడ: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పాఠశాల లైబ్రేరీ గదిలో మంటలు చెలరేగిన విషయాన్ని గుర్తించిన స్థానికులు.. స్థానిక పోలీసులు, ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. గదిలో పుస్తకాలతో పాటు మనఊరు–మనబడి పనుల కోసం తెచ్చిన సిమెంట్ బస్తాలు ఉన్నాయని, విద్యుత్ సౌకర్యం కూడా లేదని గ్రామస్తులు తెలిపారు. ఎవరో కావాలనే నిప్పు పెట్టి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు.

బుడగ జంగాల హక్కులను కాలరాస్తే సహించం



కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న కృష్ణయ్య

మరికల్: బేడ బుడగ జంగాల హక్కులను కాలరాస్తే సహించమని సంఘం రాష్ట్ర నాయకుడు గడ్డం కృష్ణయ్య అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుడగ జంగాలకు రాష్ట్ర ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. అధికార పార్టీకి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామన్నారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సిరిగిరి కుర్మన్న, ఉపాధ్యక్షుడిగా దేవేంద్ర, కోశాధికారిగా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా వెంకటయ్య, సహ కార్యదర్శిగా మాణిక్యప్ప, ప్రచార కార్యదర్శిగా మహేష్, వెంకటేష్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఆర్యవైశ్య సంఘం మండల కమిటీ ఎన్నిక

మద్దూరు: మండల కేంద్రంలోని వాసవీమాత ఆలయంలో సోమవారం ఆర్యవైశ్య సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా నాగులు, కోశాధికారిగా రవికుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా శోభారాణి, యూత్ అధ్యక్షుడిగా వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా ఆదిత్యలను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణయ్య, రాజయ్య, జగన్నాథం, చంద్రశేఖర్, కుమార్, కిరణ్ పాల్గొన్నారు.